

ఆంధ్ర ఎస్ఐపై విచారణకు ఆదేశం

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఆంధ్ర ఎస్ఐ కె.సీతారాములు ఉల్లంఘించినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణకు ఆదేశించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా కొంతమంది రాజకీయ నాయకులను ఆంధ్ర ఎస్ఐ కలిసినట్లుగా ఆరోపణలు వచ్చాయన్నారు. దీనిపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని బొబ్బిలి డీఎస్పీ డి.భవ్యరెడ్డిని ఆదేశించినట్లు చెప్పారు. ఆరోపణలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం ఎస్ఐపై క్రమశిక్షణ చర్యలు తప్పవని ఎస్పీ స్పష్టం చేశారు.

టార్గెట్ అయిపోయింది..

- ధాన్యం కొనుగోలు చేయం
- జిల్లాలో సేకరణను నిలిపివేసిన అధికారులు
- ఇంకా మిగిలి ఉన్న 1.40 లక్షల మెట్రిక్ టన్నులు
- ఆందోళనలో రైతులు



సంతకవిటి మండలం పోతురాజుపేట కల్లంలో ఉన్న ధాన్యం బస్తాలు



విజయనగరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ధాన్యం కొనుగోలు నిలిచిపోయాయి. టార్గెట్ అయిపోయిందని చెప్పి అధికారులు ధాన్యం సేకరణను నిలిపివేశారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారికి ఏం చేయాలో పాలుపోవడం లేదు. గత డిసెంబరులో ఏర్పడిన తుఫాన్ల కారణంగా వరి కోతలు, నూర్పులు ఆలస్యమయ్యాయి. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో వరి కుప్పలు పొలాల్లోనే ఉన్నాయి. కొన్నిచోట్ల నూర్పులు కొనసాగుతున్నాయి. అయితే, అధికారులు 4,50,307 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు



3,08,017 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా 1.40లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ, టార్గెట్ పూర్తయ్యిందంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. ముఖ్యంగా రాజాం నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో వంగర, సంతకవిటికి చెందిన రైతులు తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టారు.

ఇబ్బందుల నడుమ సాగు..

గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నడుమ ఖరీఫ్ ప్రారంభమైంది. అత్తెసరు వర్షాలతో రైతులు ఆరుగాలం కష్టపడాల్సి వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో కాలువలు, చెరువులకు ఇంజిన్లు పెట్టుకొని పంటలకు తడులు అందించారు. చివరకు కోతల సమయంలో తుఫాన్లు, చిరుజల్లులతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ సమయంలో ప్రభుత్వం ప్రత్యేక ప్రకటన చేసింది. రైతుల వద్ద ఉన్న చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేస్తామని .. ఎటువంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని చెప్పింది. రంగు మారిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని చెప్పుకొచ్చింది. కానీ, ధాన్యం కొనుగోళ్లలో మాత్రం ఆశించిన స్థాయిలో పురోగతి లేదు. మూడు డివిజన్లలో సైతం వెనుకబాటు స్పష్టంగా కనిపిస్తోంది. చీపురుపల్లి డివిజన్‌లో 1,58,460 మెట్రిక్ టన్నులకు గాను 1,26,491 మెట్రిక్ టన్నులనే కొనుగోలు చేశారు. ఇంకా 27,965 మెట్రిక్ టన్నులు ఉన్నాయి. బొబ్బిలి డివిజన్‌లో 1,34,734 మెట్రిక్ టన్నులకు ఇంతవరకూ కేవలం 76,805 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయగలిగారు. ఇంకా 16,733 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. విజయనగరం డివిజన్‌లో 1,57,133 మెట్రిక్ టన్నులకు గాను 76,805 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఇంకా 18,601 మెట్రిక్ టన్నుల సేకరించాల్సి ఉంది. విజయనగరం డివిజన్‌లోనే ఎక్కువగా కొనుగోలు చేయాల్సి ఉంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

30 వేల మెట్రిక్ టన్నుల అనుమతికి కోరాం..

ప్రస్తుతం ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయ్యింది. అందుకే కొనుగోలు తాత్కాలికంగా నిలిపివేశాం. రైతుల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు వస్తున్న మాట వాస్తవమే. అందుకే మరోసారి నివేదికలు తెప్పించుకున్నాం. 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరాం. కానీ 10 వేల మెట్రిక్ టన్నులకే అనుమతి వచ్చింది. మిగిలిన వాటికి కూడా అనుమతి వస్తుందని ఆశిస్తున్నాం.

-మీనాకుమారి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్, విజయనగరం

ఇక కాగిత రహిత పాలన

- స్వర్ణ పంచాయతీ పథకం ప్రారంభం
- జిల్లాలో అమలుకు శ్రీకారం
- తగ్గనున్న ఆర్థిక భారం
- పన్నుల వసూళ్లలో అక్రమాలకు చెక్



రాజాం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల బలోపేతంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. ఒక్కో సమస్యను అధిగమిస్తూ వాటికి జీవం పోస్తుంది. గత వైసీపీ పాలనలో ఐదేళ్ల పాటు పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. కేవలం సంక్షేమ పథకాలు అని ఐదేళ్ల కాలం గడిపేశారు. గ్రామాల్లో చిన్నపాటి పనులు కూడా చేయలేదు. సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు అంటూ హడావుడి తప్ప వాటిని పూర్తిచేసిన దాఖలాలు లేవు. అటు న్యాయబద్ధంగా పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు అందించలేకపోయింది జగన్ సర్కారు. అందుకే వాటిని సరిచేసే పనిలో పడింది కూటమి ప్రభుత్వం. ఇప్పటికే పల్లెపండుగ పేరుతో జిల్లాలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం జరుగుతోంది. ఇంకోవైపు ఉపాధి హామీ పనులు సైతం ఊపందుకోనున్నాయి. ఇప్పుడు తాజాగా స్వర్ణ పంచాయతీ పేరుతో సరికొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. పంచాయతీల్లో కాగిత రహిత పాలనకు శ్రీకారం చుట్టింది. అంతా డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించింది. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తోంది.

ఇక అంతా డిజిటల్..

జిల్లాలో 776 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో డిజిటల్ సేవలు తెచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అన్నిరకాల లావాదేవీలు, ఉత్తర ప్రత్యుత్తరాలు డిజిటల్ ద్వారానే చేయాలని భావిస్తోంది. అందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. 'స్వర్ణ పంచా యతీ' లాగిన్‌లో నమోదుచేశారు. సాధారణంగా స్థానిక సంస్థల్లో పంచాయతీలు కీలకం. ప్రజల మౌలిక వసతులు తీర్చడం వాటి ప్రధాన కర్తవ్యం. అలాగే వివిధ రకాల పన్నుల వసూలు చేసి.. తిరిగి వాటిని ప్రజల కోసమే ఖర్చు చేయడం కూడా వాటి విధి. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇంటి, ఆస్తి పన్నులకు సంబంధించి భారీగా అవకతవకలు జరిగినట్టు ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల ప్రజల నుంచి పన్నులు సేకరించి సిబ్బంది సొంత అవసరాలకు మళ్లించినట్టు సైతం ఆరోపణలు వినిపించాయి. అందుకే పన్నుల వసూలుకు సైతం పారదర్శకత తేవాలని స్వర్ణ పంచాయతీ పథకాన్ని తెరపైకి తెచ్చారు. ఇక నుంచి దీని ద్వారా డిజిటల్ విధానంలో పన్నులు వసూలు చేయనున్నారు. ఇప్పటికే ఇంటి పన్నుల రూపంలో రూ.14.16 కోట్లు, నాన్ ట్యాక్స్ రూపంలో రూ.4 కోట్ల వసూలుకు ప్రభుత్వం టార్గెట్ పెట్టుకుంది. మార్చి 31లోగా వసూలు చేయాలని నిర్ణయించింది.

తగ్గనున్న ఆర్థిక భారం..

దాదాపు ప్రభుత్వ శాఖలన్నీ కాగితపు సేవలకు స్వస్తిపలికాయి. ఇక అంతా డిజిటల్ సేవలే. కాగితపు సేవలతో ఖర్చు ఎక్కువగా ఉంటుంది. నిర్వహణ కూడా చాలా కష్టం. రికార్డుల భద్రత కూడా కత్తిమీద సాములా మారుతోంది. కాగితపు సేవలతోనే అనేక రకాల అవకతవకలకు ఆస్కారం ఉంటుంది. పైగా పంచాయతీలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయి. ఇటువంటి తరుణంలో స్టేషనరీ, ఇతరత్రా ఖర్చులకు చాలా ఇబ్బందికరం. అందుకే డిజిటల్ సేవల వైపు ప్రభుత్వం మొగ్గుచూపింది. పాలనలో పారదర్శకత, భవిష్యత్‌లో సులువుగా గణాంకాలు తెలుసుకోవడం వంటి వాటికోసమే డిజిటల్ సేవలను తెచ్చినట్టు ప్రభుత్వం చెబుతోంది. జిల్లాలోని 776 పంచాయతీలకుగాను.. దాదాపు డిజిటలైజేషన్ పూర్తయినట్టు తెలుస్తోంది.

పారదర్శకత కోసమే..

పంచాయతీల్లో డిజిటలైజేషన్ చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్ణ పంచాయతీ పథకాన్ని అమలు చేస్తున్నాం. ప్రతి ఇంటి వివరాలను నమోదుచేశాం. పన్నుల వసూలు కూడా ఈ లాగిన్ ద్వారానే చేస్తాం. పారదర్శకత కోసమే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

-వెంకటేశ్వరరావు, డీపీవో, విజయనగరం

మంచి నిర్ణయం..

ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. డిజిటలైజేషన్‌తో పంచాయతీలకు కొంత ఖర్చు తగ్గుతుంది. గత ఐదేళ్లగా పంచాయతీలను దారుణంగా దెబ్బతీసింది కూటమి ప్రభుత్వం. ఇప్పుడిప్పుడే పంచాయతీలు కుదురుకుంటున్నాయి. ఇటువంటి సమయంలో డిజిటలైజేషన్ ఆహ్వానించదగ్గదే.

-వంగా వెంకటరావు, సర్పంచ్, ఒమ్మి

మంచి రోజులు వచ్చాయి..

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే పంచాయతీలకు మంచిరోజులు వచ్చాయి. పల్లెపండుగతో పాటు ఆర్థిక సంఘం నిధులతో పెద్ద ఎత్తున పనులు జరుగుతున్నాయి. గత ఐదేళ్లగా వైసీపీ సర్కారు పంచాయతీలకు చిల్లిగవ్వ ఇవ్వలేదు. కూటమి వచ్చిన తరువాతే స్వాంతన కలిగిస్తూ నిర్ణయాలు తీసుకుంటోంది.

- కె.జగదీష్, సర్పంచ్, ఎం.జోగివలస



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్య రెడ్డి, సీఐ సతీష్ కుమార్

బొబ్బిలిలో భారీ చోరీ

- రూ.20లక్షల నగదు, 40 తులాల బంగారం అపహరణ

బొబ్బిలి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీ పరిధి చినబజార్ వీధిలో నివాసముంటున్న గ్రంధి రవికుమార్ ఇంట్లో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. రూ.20 లక్షల నగదు, 40 తులాల బంగారాన్ని దొంగలు అపహరించారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రవికుమార్ తన నివాస సమీపంలో జ్యూయలర్ షాప్ నిర్వహిస్తున్నాడు. కుంభమేళాకు వెళ్లేందుకు శనివారం సాయంత్రం విశాఖపట్నంలోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆయన భార్య వారం కిందటే విశాఖలోని తన పుట్టింటికి వెళ్లింది. వచ్చేవారం అంతా కలిసి కుంభమేళాకు వెళ్లడానికి ప్లాన్ చేసుకున్నారు. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో దొంగలు చోరీకి తెగబడ్డారు. తలుపులను బద్దలుకొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలో ఉన్న రూ.20 లక్షల నగదు, బీరువా లాకర్‌లో పెట్టిన 40 తులాల బంగారాన్ని దోచుకుపోయారు. ఆదివారం ఉదయం ఇంటి పని మనిషి వచ్చి చూడగా తలుపులు బార్లగా తెరిచి ఉండడంతో ఎదురుగా ఉన్న ఓ షాపు యజమానికి విషయం తెలియజేసింది. ఆయన రవికుమార్‌కి ఫోన్ చేశాడు. వెంటనే రవికుమార్ వైజాగ్ నుంచి ఇంటికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ భవ్యరెడ్డి, పట్టణ సీఐ కె.సతీష్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలను సేకరించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రానికి మీరేం చేశారు?

- ఒక్కప్రాజెక్టునైనా తీసుకొచ్చారా?
- పథకాల పేరుతో ఆర్థికంగా దెబ్బతీశారు
- బొత్స వల్ల విద్యాశాఖ నాశనమైంది
- మంత్రి కొండపల్లి



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బాగా లేదని వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యానారాయణ చేసిన వ్యాఖ్యలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బొత్స చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఐదేళ్లలో రాష్ట్రానికి మీరేం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఆదివారం విజయనగరంలోని ఆయన కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. 'వైసీపీ పాలనలో అప్పటి సీఎం జగన్‌తో పాటు మంత్రులు పథకాల పేరు చెప్పి రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీశారు. రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టు కూడా తీసుకురాకుండా దోచుకుతిన్నారు. గతంలో దావోస్ పర్యటన చేసిన జగన్ రాష్ట్రానికి ఎన్ని పరిశ్రమలు తీసుకొచ్చారో బొత్స చెప్పాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 7 నెలల్లోనే విశాఖ స్టీల్ ప్లాంట్, పోలవరం, రైల్వేజోన్‌లకు కేంద్రం నుంచి వేల కోట్ల రూపాయల నిధులు తెచ్చాం. ఈ ఘనత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌దే. చంద్రబాబు దావోస్ పర్యటన విజయవంతం అయ్యింది. గూగుల్ వంటి ఎన్నో ఇంటర్నేషనల్ కంపెనీలు రాష్ట్రానికి క్యూ కడుతున్నాయి. వైసీపీ నేతలు ఏమీ చేయలేక, ప్రజలకు సమాధానం చెప్పుకోలేక.. అసూయ పడి మాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన బొత్స సత్యానారాయణ ఆ శాఖను నిర్వీర్యం చేశారు. 117 జీవోను ప్రవేశపెట్టి ఎన్నో పాఠశాలలు మూతపడేలా చేశారు. ఆయన వలన విద్యాశాఖలో రిజల్ట్స్ దారుణంగా పడిపోయాయి. ఇలాంటి వారు విద్యాశాఖ గురించి మాట్లాడటం హాస్యాస్పదం. భోగాపురం ఎయిర్ పోర్టు దగ్గర పరిశ్రమలు పెట్టి అభివృద్ధి చేస్తామన్నారు. ఎక్కడ అభివృద్ధి జరిగిందో చూపాలి. ఐదేళ్లలో బీచ్‌రోడ్డు ఎక్కడ వేశారో చెప్పాలి. కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి ఎంతో మేలు కలగనుంది. ఉత్తరాంధ్ర, రాయలసీమకు సాగు, తాగునీరుకు ఢోకా ఉండదు. ఇకనైనా వైసీపీ నేతలు సత్యదూరమైన వ్యాఖ్యలు మానుకోవాలి.' అని హితవుపలికారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు కొండపల్లి భాస్కరనాయుడు, చప్ప చంద్రశేఖర్ తదిరులు పాల్గొన్నారు.

అరకొరగానే..

- పూర్తిగా పంపిణీ చేయని కందిపప్పు
- జిల్లాలో 16 శాతం రేషన్‌కార్డుదారులకే సరఫరా
- మిగిలిన వారికి నిరాశే





ఎండీయూ ద్వారా బియ్యం పంపిణీ


విజయనగరం, కలెక్టరేట్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ కార్డుదారులకు కందిపప్పు అరకొరగా పంపిణీ జరుగుతుంది. కేవలం 16 శాతం కార్డుదారులకే సరఫరా చేశారు. మిగిలిన వారికి అందకపోవడంతో నిరాశ చెందుతున్నారు. బయట మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.150కి కొనుగోలు చేయాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 5.80లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈ కార్డుదారులకు ప్రతినెలా పంపిణీ చేసేందుకు 580 మెట్రిక్ టన్నుల కంది పప్పు అవసరం. కానీ, ఈ నెల కేవలం 98 మెట్రిక్ టన్నులే వచ్చింది. దీంతో 16 శాతం మంది కార్డుదారులకే కంది పప్పును అందించారు. మిగిలివారికి కేవలం బియ్యం, పంచదార మాత్రమే సరఫరా చేస్తున్నారు. రేషన్ డిపోల ద్వారా కిలో కందిపప్పును రూ.67కే కార్డుదారులకు అందుతుంది. బయట మార్కెట్‌లో కిలో రూ.150 పైబడి విక్రయిస్తున్నారు. దీంతో ఈ ధరకు పప్పును కొనుగోలు చేయలేక కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. అందరికీ కందిపప్పు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు. దీనిపై పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మీనాకుమారి మాట్లాడుతూ.. 'జిల్లాకు ఫిబ్రవరిలో కందిపప్పు ఎలాట్‌మెంట్ లేదు. ప్రస్తుతం ఉన్న 98 మెట్రిక్ టన్నుల కందిపప్పును రేషన్ డిపోలకు పంపించాం.' అని వెల్లడించారు.

ఉపాధి రుణాలకు తాత్కాలిక బ్రేక్

- మార్చి 3 తరువాతే మళ్లీ ప్రక్రియ
- ఎన్నికల కోడ్‌తో ఈసీ ఆదేశం

విజయనగరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈబీసీ, బీసీ వర్గాలకు అందించే ఉపాధి రుణాలకు తాత్కాలిక బ్రేక్ పడింది. మార్చి 3 తరువాత మళ్లీ ఆ ప్రక్రియ ప్రాంభం కానుంది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో రుణాల ప్రక్రియను నిలిపివేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈబీసీ, బీసీ వర్గాలకు స్వయం ఉపాధి రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం గత నెల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 7లోగా సదరు వర్గాలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దీనిపై ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసింది. అయితే, దీనిపై ఈసీ స్పష్టత ఇచ్చింది. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాతే రుణాల ప్రక్రియ చేపట్టాలని చెప్పింది. దీంతో మార్చి 3 వరకూ సంక్షేమ పథకాలకు తాత్కాలిక బ్రేక్ పడినట్టయింది.

వైభవంగా రథసప్తమి ఉత్సవాలు



విద్యుత్ కాంతుల్లో ఆదిత్యుని ఆలయం

అరసవల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరస వల్లిలో రథసప్తమి ఉత్సవాలు.. ఆదివారం వైభవంగా ప్రారంభమ య్యాయి. కూటమి ప్రభుత్వం రథసప్తమిని రాష్ట్ర పండగగా ప్రకటిం చడంతో.. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది సంబరాలు అంబరాన్ని తాకాయి. వేడుకల వేళ.. సిక్కోలు సుందరంగా ముస్తాబైంది. శ్రీకా కుళం నగరం నుంచి అరసవల్లి వరకూ ఎక్కడ చూసినా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా.. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా సిక్కోలు శోభ కనిపించింది. తొలిరోజు శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో 5వేల మందితో సూర్యనమస్కారాలు, ధ్యానం చేశారు. ఆదిత్యుని శోభాయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- అరసవల్లిలో సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి సూర్య నారాయణస్వామికి క్షీరాభిషేకం నిర్వహిస్తారు. ప్రత్యేక పూజలు అనంతరం స్వామి నిజరూప దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. సుమారు 1.20 లక్షల మంది భక్తులు రథసప్తమి ఉత్సవాలకు తరలిరానున్నట్టు అధికారులు అంచనా వేశారు. 2,300 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం జిల్లాల అధికారులు కూడా ఉత్సవ కార్యక్రమాల విధులు నిర్వర్తిస్తున్నారు.

రూ.లక్షలు వెచ్చించి.. నిర్లక్ష్యంగా వదిలేసి..

● నిరుపయోగంగా సామూహిక మరుగుదొడ్లు

గజపతినగరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బహిరంగ మలవిసర్జన నిర్మూలనకు రూ. లక్షల వ్యయం చేసి మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టినా అవి నిరుపయోగంగా ఉన్నాయి. వాటిపై పంచాయతీ పాలకులు, అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణం. మండలంలోని గంగచోళ్లపెంటలో రూ.6 లక్షలతో గతంలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణాలు చేపట్టినా వాటిని వినియోగంలోకి రాలేదు. అలాగే గంగచోళ్లపెంట నుంచి పత్రువాడకు వెళ్లే రహదారికి ఆనుకుని సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు. అవీ వినియోగానికి దూరంగా ఉన్నాయి. దాంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికైనా అధికారులు సామూహిక మరుగుదొడ్ల వినియోగానికి చర్యలు చేపట్టాల్సి ఉంది.



గంగచోళ్లపెంటలో సామూహిక మరుగుదొడ్లు ఇవే..

సతీశ్‌కు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న సతీశ్

వేపాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సంగీతం, కీబోర్డు వాయిద్యంలో విశిష్టమైన ప్రతిభ కనబరిచిన మం టడలంలోని నీలకంఠరాజపురం గ్రామానికి చెందిన చీపురుపల్లి సతీశ్‌కు తెలుగు వెలుగు నంది పురస్కారం వరించింది. ఆదివారం విజయవాడలో ని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్య క్రమంలో మండలి మాజీ స్పీకర్ బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

11న ప్రసాదాల విక్రయానికి వేలం

వంగర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సంగాం సంగమేశ్వర స్వామి దేవాలయంలో మహా శివరాత్రి సందర్భంగా ఈనెల 26 నుంచి వచ్చేనెల 4 వరకూ నిర్వహించనున్న జాతరలో ప్రసాదాలు విక్రయానికి ఈ నెల 11 వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమి టీ చైర్మన్ బి.ఆనందరావు ఓ ప్రకటనలో తెలిపారు. లడ్డు, పులిహోరా ప్రసాదాల అమ్మకానికి వేలం పాట లో పాలొనే వారు ముందుగా రూ.25 వేలు ధరావ త్తు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు.

8 నుంచి హిందీ పరీక్షలు

రాజాం రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దక్షి ణ భారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో ఈనెల 8,9 తేదిల్లో హిందీ పరీక్షలు నిర్వహిస్తామని హిందీ ప్రచారక్ కె.మదుసూధనరావు ఓ ప్రకటనలో తెలిపా రు. పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష, వి శారద, ప్రవీణ పరీక్షలు నిర్వహిస్తామని తెలి పారు. హాల్‌టికెట్లు, అదనపు సమాచారం కోసం 99499 17365 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

7 నుంచి మజ్జి గౌరమ్మ జాతర

రాజాం రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతకాపల్లిలోని మజ్జి గౌరమ్మ జా తర మహోత్సవాలు ఈనెల 7 నుంచి 9 వరకు జరగనున్నాయి. మూడు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప లు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాల ముగింపు రోజున మధ్యాహ్నం తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నారు. ఒడిశాలోని రాయగడ తర్వాత అంతకాపల్లిలో మాత్రమే మజ్జి గౌరమ్మ దేవాలయం ఉండటంతో తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్నారు.

ఒంటరి వృద్ధులకు నిత్యావసరాలు

కొత్తవలస, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని తుమ్మికాపల్లి గేట్ సమీపంలోని వినాయక నగర్‌లోని ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వ ర్యంలో ఆదివారం 45 మంది ఒంటరి వృద్ధులకు ని త్యావసరాలను అందించారు. కొత్తవలసకు చెందిన దాత చంద్రశేఖర్ వీటిని సమకూర్చారు. కార్యక్రమం లో దాతలు చంద్రశేఖర్, మధుబాల దంపతులు, ట్రస్టు సభ్యులు రవి, గోవిందరావు, రమణ, శ్రావణ్ కుమార్, నగేష్, గణేష్ పాల్గొన్నారు.

ఉచితంగా ఫ్రీజర్ బాక్స్ సేవలు

వంగర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనహిత స్వచ్ఛంద సంస్థ ఫ్రీజర్ బాక్స్‌ను వితరణ చేసింది. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దాన్ని అందజేశారు. కార్యక్రమం లో స్వచ్ఛంద సంస్థ సభ్యులు రమణ, బెవర సాయి రాం, బలగ పోలినాయుడు, బలగ వెంకటనాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

చెస్‌లో వైష్ణవికి తృతీయ స్థానం

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్ర జ్యోతి): విజయనగరంలో నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో మండలంలోని తిమిడి పాఠశాలకు చెందిన ఐదోతరగతి విద్యార్థిని వైష్ణవి తృతీయ స్థానం సాధించిందని ఉపాధ్యాయుడు సుందరపు అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతిఒక్కరూ చదువుకోవాలి

గంట్యాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సమా జంలో చదువుకున్న వ్యక్తులను గౌరవిస్తారని, అందు కు ప్రతిఒక్కరూ చదువుకోవాలని సత్యసాయి మం దిర్ ప్రతినిధి స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం కొటారుబిల్లి టీటీడీ కల్యాణ మండపంలో టెన్త్, ఇంటర్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. కార్యక్రమంలో స్పోకన్ ఇంగ్లీష్ సంస్థ డైరెక్టర్ చిరంజీవి, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాల యం మాజీ వైస్ చాన్సలర్ ముత్యాలునాయుడు, గంట్యాడకు చెందిన బూడి అప్పలనాయుడు, లక్కిడాంకు చెందిన పాశల కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా భూదేవమ్మ తీర్థం

లక్కవరపుకోట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మం డలంలోని మార్లాపల్లిలో ఆదివారం భూదేవమ్మ తీ ర్థం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్థు లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, చిటికెల భజన, కోలాటాలు నిర్వహించారు. సాయంత్రం బాణసంచా కాల్చారు.

● వేపాడ: వేపాడ శివారు బక్కునాయుడుపే టలో పరదేశమ్మతల్లి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు.

బడ్జెట్‌లో అన్ని వర్గాలకు న్యాయం



ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్ర జ్యోతి): కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి బడ్జెట్ అన్ని వర్గాలకు న్యాయం చేసేలా ఉందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పేర్కొన్నారు. ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. రూ.12 లక్షల వరకూ ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వడంతో మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. జలజీవన్ మిషన్ పథకాన్ని 2028 వరకూ పొడిగించడంపై హర్షం వ్యక్తం చేశారు. నదుల అనుసంధానం ద్వారా జలజీవన్ మిషన్ లక్ష్యాన్ని చేరుకోవచ్చునన్నారు. రాజధాని అమరావతి, జీవనాడి పోలవరం వంటి వాటికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించడంతో ఆ రెండు కూటమి హయాంలోనే పూర్తవుతాయన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యంగా ప్రకటించిన ఈ బడ్జెట్ వికసిత్ ఆంధ్రప్రదేశ్‌కు మార్గసూచికమని అభిప్రాయపడ్డారు.

ఏపీకి అన్యాయం: లోక్‌సత్తా



మాట్లాడుతున్న బాబ్జీ

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో అనేక సమస్యలు కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సినవి ఉన్నాయన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి నేటికీ సొంత గనులు లేవన్నారు. వాల్తేరు రైల్వే డివిజన్ కోసం కనీస ప్రస్తావన లేదని, గిరిజన వర్సిటీకి నిధులు కేటాయింపులు చేయలేదన్నారు. ఆరోగ్య రంగానికి తక్కువ నిధులు కేటాయించడం సరికాదన్నారు. సమావేశంలో కార్మిక నాయకులు య.శ్రీనివాసరావు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

యువతకు, రైతులకు పెద్దపీట వేస్తా..



రాజేశ్‌వర్మను సత్కరిస్తున్న గ్రామస్థులు

గుర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువత, రైతన్నల అభివృద్ధికి పెద్దపీట వేస్తానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్‌వర్మ అన్నారు. ఆదివారం పల్లిగండ్రేడులో ఆయనకు అభినందన సభ నిర్వహించారు. బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి స్వగ్రామం రావడంతో ఆయన స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో యువత, రైతులను అభివృద్ధి చేసేందుకు నిధుల కేటాయింపునకు కృషి చేస్తానన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని రాజేశ్‌వర్మ ప్రారంభించారు. మెడికవర్ ఆసుపత్రి డాక్టర్ రామలక్ష్మి రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్యులకు రక్షణ కల్పించండి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్య వైశ్యులు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలో ఆర్య వైశ్యులకు పోలీసులు రక్షణ కల్పించాలని కోరుతూ ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం పోలీసులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్య వైశ్యసంఘ ప్రతినిధులు హెచ్ నానాజీ, కొల్లా శ్రీనివాసరావు, వెంకటేశ్, కె.శ్రీను, చక్క కిరణ్‌కుమార్, కాపుగంటి వాసు మాట్లాడుతూ మద్యం మత్తులో స్థానిక వన్‌వే సమీపంలో కిరాణా దుకాణం వద్ద మందుబాబులు వీరంగం, వైశ్యుడిపై దాడి, పురస జంక్షన్‌లో సాయికుమార్ ఇంటిపై దాడి, ఇటీవల కిరాణా దుకాణాల్లో దొంగతనాలతో వైశ్యులు భయపడుతున్నారన్నారు. వారిపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై అభ్యతరం తెలిపారు. ఇకనైనా దాడులకు తెగబడినవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోట్నూరు సాయిరాం,విజయ్‌కుమార్,సతీష్,శివకుమార్ తదితరులు వున్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



ఎమ్మెల్యేకు మొక్క అందజేస్తున్న దృశ్యం

రాజాం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన సూచించారు. ఆదివారం రాజాం వచ్చిన ఆయనను రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి ప్రతినిధులు కలిసి కొన్ని మొక్కలను అందజేశారు. రాజాం పట్టణంలో వేలాది మొక్కలు నాటుతున్నామని సమితి ప్రతినిధులు ఆర్‌వీజే నాయుడు, పెంకి చైతన్యకుమార్ ఎమ్మెల్యేకు వివరించారు. ఆయనతో పాటు పెంకి గౌరీశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన వ్యాకులమాత జాతర



జాతరలో భక్తులు

కొత్తవలస, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో కొండడాబా వ్యాకులమాత జాత ర ఆదివారం ప్రశాంతంగా ము గిసింది. తొమ్మిది రోజులుగా నిర్వహించిన ఉత్సవంలో ఆదివా రం తెల్లవారు జాము నుంచి ఉ దయం 11 గంటల వరకు ప్రతి గంటకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొండడాబా కొండ మైదానంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రైస్తవ మత పెద్దల ఆధ్యాత్మిక ప్రసంగాలతో ఉత్సవాలను ముగిసినట్టు ప్రకటించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

సంగీత, నృత్య కళాశాలను సందర్శించండి

● ఇళయరాజాకు విజయనగరం ఎంపీ ఆహ్వానం



ఇళయారాజాకు పుస్తకాన్ని అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి

విజయనగరం/ చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ను సందర్శించాలని 'ఇసైజ్ఞాని' ఇళయ రాజాకు టీడీపీకి చెందిన విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆహ్వా నం పలికారు. చెన్నై నగరంలోని ఇళయ రాజా నివాసానికి ఆదివారం వెళ్లిన ఎంపీ అప్పలనాయుడు... మహారాజా సంగీత, నృత్య కాలేజీ విశిష్టతను వివరించారు. ఘంటసాల, సుశీల, శ్రీరంగం గోపాల రత్నం వంటి మహోన్నతులను దేశా నికి అందించిన ఘనత ఈ కళాశాలకు ఉందని, సమాజానికి వేల సంఖ్యలో కళాకారులను అందించిందని గుర్తు చే శారు. 1919 లో విజయరామ గజపతి రాజు ప్రారంభించిన ఈ కాలేజీ ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల ప్రజలు మాత్రమేకాకుండా, పక్కనే ఉన్న ఒరిస్సా ప్రజలకు కూడా సేవ చేస్తోందన్నారు. అలాంటి మహోన్నత కాలేజీని సందర్శించాలని ఇళయరాజాను ఎంపీ అప్పలనాయుడు కోరారు. ఈ సందర్భంగా ఇళయరాజాను ఘనంగా సత్కరించి, 'ది లాస్ట్ మహారాజా ఆఫ్ విజయనగరం' పేరుతో ముద్రించిన పీవీజీ రాజు జీవిత చరిత్ర పుస్తకాన్ని బహూకరించారు.

సర్వే సందేహాల నివృత్తికి ఎక్స్‌పర్ట్ సెల్: జేసీ

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేకు సంబంధించి భూ యాజమానుల సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా సర్వే భూరికార్డుల కార్యాలయంలో ఒక ఎక్స్‌పర్ట్ సెల్‌ను ఏర్పాటు చేసినట్టు జేసీ సేతుమాదవన్ ఓ ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని దీనికి ఇన్‌చార్జిగా నియమించామన్నారు. ఎక్స్‌పర్ట్ సెల్ అధికారిగా సర్వే భూరికార్డులు శాఖకు చెందిన ఏ మన్మథరావును నియమించామన్నారు. పనిదినాల్లో ఉదయం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలు వరకూ 9441633116 నెంబరులో ఆయన అందుబాటులో ఉంటారన్నారు. ఆయనకు సహాయకుడిగా డిప్యూటీ సర్వేయర్ ఎస్‌వీఆర్ సురేష్‌రెడ్డి నియమించామన్నారు. ఆయన 9440364608 నెంబరులో అందుబాటులో ఉంటూ సందేహాలు నివృత్తి చేస్తారని పేర్కొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించండి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమాధికారి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పదో త రగతి పరీక్షల్లో బీసీ సం క్షేమ వసతిగృహాల విద్యార్థులు ఉత్తమ ఫలి తాలు సాధించాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి పెంటోజీరావు ఆకాంక్షించారు. మండ లంలోని మొయిద విజయరాంపురంలో 13 వసతి గృహాలకు చెందిన టెన్త్ విద్యార్థులకు ప్రేరణ, పునశ్చరణ తరగతులను ఆదివారం లాంఛనంగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో విజయనగరం అర్బన్, రూరల్ సహాయ సంక్షేమ అధికారులు రాజులమ్మ, యశోదనరావు, వసతిగృహ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, జానకిరావు, మొయిద వసతిగృహం సంక్షేమాధికారి పతివాడ కన్నం నాయుడు, వసతి గృహాల సంక్షేమాధికారులు టి.వి.రమణ, సోమశేఖర్, అప్ప లకొండ, జగదాంబ, శ్రీదేవి, శరణ్మయి, సత్యనారాయణతో పాటు డీటీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఎక్కడ?



మోడల్ స్కూల్‌లో అరకొరగా హాజరైన విద్యార్థులు

గజపతినగరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని టెన్త్ విద్యారుల శతశాతం ఉత్తీర్ణతకు ప్రభుత్వం ప్రకటించిన వందరోజుల యాక్షన్ ప్లాన్ మండలంలో అమలు కావడంలేదు. డిసెంబరు 7 నుంచి మార్చి 7 వరకు ఆదివారాల్లోనూ ప్రత్యేక శిక్షణ తరగతులు విద్యార్థులకు నిర్వహించాల్సి ఉంది. సెలవు రోజుల్లో శిక్షణ తరగుతులకు హజరైన విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించాల్సి ఉంది. అయితే మండలంలోని మరుపల్లి జడ్పీ హైస్కూల్‌లో 65 మంది టెన్త్ విద్యార్థులు ఉన్నప్పటికీ ఆదివారం శిక్షణ తరగతులు నిర్వహించలేదు. కాగా అదే గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రత్యేక తరగతులకు 73 మంది విద్యార్థులకు గానూ 16 మంది మాత్రమే హజరయ్యారు. ఈ విషయంపై మోడల్ ప్రిన్సిపాల్ గెద్ద ఈశ్వరరావును వివరణ కోరగా డిప్యూటీ డీఈవో ఆదేశాల మేరకు ఓ ప్రైవేట్ కళాశాలలో నిర్వహించిన పాలిటెక్నిక్ మోడల్ పరీక్షకు విద్యార్థులను పంపించామన్నారు. దీనిపై డిప్యూటీ డీఈవో మోహనరావును వివరణ కోరగా తాను ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదన్నారు. ఈ విషయం డీఈవో దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

ఎమ్మెల్సీ హామీతో ఆందోళన విరమణ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

వేపాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆతవకు తారు రోడ్డు వేయాలంటూ గత నెల 27 నుంచి ఆందోళన చేపడుతున్న గ్రామస్థులు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హామీతో శాంతించారు. ఆదివారం గ్రామస్థులతో ఎమ్మెల్సీ మాట్లాడి ఈనెల 12లోగా రోడ్డు పనులు మొదలుపెడతామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఎమ్మెల్సీ రాకను తెలుసుకున్న ఎంపీడీవో సూర్యనారాయణ, తహసీల్దార్ జె.రాములమ్మ, పీఆర్ డీఈఈ సత్యనారాయణ శిబిరం వద్దకు చేరుకున్నారు.

అరసవల్లికి రామతీర్థం రథం



రథానికి అర్చకుల పూజలు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో నిర్వహిస్తున్న రథసప్తమి వేడుకలకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామివారి దేవ స్థానం నుంచి నమూనా విగ్రహాల తో కూడిన ప్రచార రథం ఆదివారం బయలుదేరింది. ఈ రథానికి దేవ స్థానం ఈవో వై.శ్రీనివాసరావు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ప్రధాన అర్చకుడు ఖండవిల్లి సాయిరామాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

క్రైం న్యూస్

ఉపాధ్యాయురాలి మృతి

● కుంభమేళా నుంచి తిరిగి వస్తూ ప్రమాదానికి గురైన కారు



సౌజన్య(ఫైల్)

పూసపాటిరేగ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలం లోని కనిమెట్టలో జాతీయరహదారిపై ఆదివారం తెల్లవా రు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖలో నివా సం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు బి.సౌజన్య దుర్మరణం చెందారు. మృతురాలు భోగాపురం మండలం లోని పోలిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ లో నివాసం ఉంటున్న సౌజన్య.. భర్త కింగువ రవికుమార్, ఇద్దరు పిల్లలు, అత్త భోగి భవానీతో గతనెల 27న కారులో కుంభమేళాకు వెళ్లారు. తిరిగి వ స్తుండగా ఆదివారం తెల్లవారుజామున కనిమెట్ట వద్ద విశాఖ వైపు వెళ్తున్న లారీని కారు వెనుక నుంచి ఢీకొంది. దాంతో డ్రైవర్ వెనుకవైపు కూర్చొన్న సౌజన్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. దాంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్, భవానీలకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంపై జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ దుర్గాప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువతి ...



లీల (ఫైల్)

భోగాపురం, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అనకాపల్లి జిల్లా దేవరాపల్లికి చెందిన రొంగలి లీల (23) మృతి చెందారు. ఈ ప్రమాదంతో పూసపాటిరేగ మండలం కోనాడ గ్రామానికి చెందిన అడపాక శివగణేష్ తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాలు ప్రకా రం మండలంలోని ముంజేరు సమీపంలో సాఫ్ట్‌వేర్ సంస్థ లో పనిచేస్తున్న ఆరుగురు స్నేహితులు ఆదివారం రాత్రి మూడు ద్విచక్ర వాహనాలపై శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే జాతీయ రహదారిపై తగరపువలస వైపు వెళ్తున్నారు. అయితే పోలిపల్లి, అవనం జంక్షన్ మధ్య జాతీయ రహదారిపైకి వచ్చే సరికి అదే రహదారిలో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు ఒక ద్విచక్ర వాహనాన్ని వెనుక నుం చి ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న రొంగలి లీల రోడ్డుపై పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదంలో ఎ.శివ గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని తగరపువలసలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉంది. లీల రెండేళ్ల నుంచి సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తోంది. ఆమెకు రొంగలి లక్ష్మి, పెద్దినాయుడు తల్లిదండ్రులతో పాటు చెల్లెలు ఉంది. మృతురాలు తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. కుమార్తె మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఈ ఘటనపై సీఐ ప్రభాకర్ కేసు నమోదు చేశారు.

ప్రజల అవసరాలు తీర్చని బడ్జెట్

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి పార్లమెంట్‌లో ప్రకటించిన బడ్జెట్ ప్రజల అవసరాలు తీర్చేలా లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రమణమ్మ, జగన్మోహన్‌రావు అన్నారు. సీపీఎం దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పన్ను మినహాయింపు పేరుతో మధ్యతరగతి వారిని నయవంచన చేసేలా బడ్జెట్ ఉందన్నారు. కార్యక్ర మంలో సీపీఎం ప్రతినిధులు రమణ, రామచంద్రరావు, లక్ష్మి, రాము, ఆనంద్ పాల్గొన్నారు.

● కొత్తవలస: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఆదివా రం కొత్తవలస గాంధీనగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ బడ్జెట్ తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేసిందని అప్పారావు ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పీవీరమణ, వంక ఆదినారాయణ, హరీష్, గాడి సురేష్, మూనూరు రాజు, కండిపల్లి తాతబాబు పాల్గొన్నారు.

కొండచిలువ హతం



హతమైన కొండ చిలువ

భోగాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలం ఉప్పాడపేట సమీపంలో ఆదివారం భారీ కొండ చిలువల కనిపించడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. గ్రామ సమీపంలోని మామిడితోటలోకి ఎప్పటిలాగే స్థానికులు వెళ్లగా అక్కడ పొదల్లో కొండచిలువ కనిపించడంతో బెంబేలెత్తిపోయారు. కొంత మంది అక్కడకి చేరుకుని దాన్ని హత మార్చారు. కొండ చిలువ సుమారు 10 అడుగుల పొడవు ఉంది.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఆదివారం ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. 250 మందిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. రహదారి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 393 కేసులు నమోదు చేసి రూ.1.20 లక్షల పైచిలుకు మొత్తం ఈ-చలానాగా విధించినట్టు తెలిపారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నియంత్రణకు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో అధ్యక్షుడు మజ్జి అప్పారావు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం తోష్నీవాల్ వాకర్స్ క్లబ్ రోడ్డు సేఫ్టీ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ జంక్షన్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సత్యవతికి ఎమ్మెల్యే పరామర్శ



సత్యవతి నివాసంలో ఎమ్మెల్యే

నెల్లిమర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరపంచాయతీ పరిధి లోని లక్ష్మీదేవిపేటకు చెందిన 16వ వార్డు కౌన్సిలర్, జనసేన నాయకురాలు పొంద్రంకి సత్యవతిని ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదివారం పరామర్శించారు. సత్యవతి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లక్ష్మీదేవిపేట వచ్చి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సత్యవతి భర్త, జనసేన నాయకుడు పొంద్రంకి సత్యనారాయణ, ఎం.ఎం.నాయుడు, జనా ప్రసాద్, కాళ్ల మహేష్, మజ్జి రాంబాబు తదితరులు ఉన్నారు

కడారికి ఆర్థిక సాయం

వేపాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : వేపాడ గ్రామానికి చెందిన కడారి అంకుశం వెన్నుపూసకు శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో అతడికి గోల్డ్ హార్ట్ ట్రస్టు సభ్యులు ఆదివారం రూ. 10 వేలు ఆర్థికసాయం చేశారు. కడారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో గోల్డ్ హార్ట్ ట్రస్టు సభ్యులు సాయం చేశారు. అదే గ్రామానికి చెందిన బోజంకి లక్ష్మణరావు అంకుశం వైద్య ఖర్చుల నిమిత్తం మరో రూ.10 వేలు అందజేశారు. అలాగే మన నేస్తం ట్రస్టు సభ్యులు కడారికి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఇదిలా ఉండగా అదే గ్రామానికి చెందిన మాదేటి సాయితేజ శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో సాయితేజకు రూ.5 వేలు, గొర్లె సూర్యనారాయణకు రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు.

టాలెంట్ టెస్ట్‌లో కుమారాం విద్యార్థుల ప్రతిభ

జామి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని ఆర్‌వీఆర్ఎస్ రాజా కళాశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని కుమారాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఉషశ్రీ, సుషన్న ప్రతిభ చాటారని ఉపాధ్యా యుడు గుండా శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు అభినందించారు.



సంకిలి వంతెనపై విరిగిపోయిన రెయిలింగ్

రెయిలింగ్ విరిగి.. రోడ్డు పాడై

● కనీస మరమ్మతుకు నోచుకోని వైనం ● ఇదీ నాగావళిపై సంకిలి వంతెన వద్ద పరిస్థితి

రేగిడి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పాలకొండ-విశాఖ ప్రధాన రహదారిలో నాగావళిపై సంకిలి వంతెన ప్రమాదకరంగా మారింది. నాలుగు దశాబ్దాల కిందట నిర్మించిన రెయిలింగ్ విరిగిపోయింది. దానికి ఆనుకుని ఉన్న రోడ్డు కూడా పూర్తిగా పాడయ్యింది. రెండు వైపులా రెయిలింగ్ విరిగిపోవడంతో ఏపాటు ఏమరపాటు ఉన్నా నదిలోకి పడిపోయే ప్రమాదముందన్న భయాందోళన నెలకొంది. దీనికితోడు వంతెన రోడ్డుపై పలుచోట్ల పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో వాహనచోదకులు అగచాట్లకు గురవుతున్నారు. నాలుగు దశాబ్దాల కిందట నిర్మించిన వంతెన కనీస నిర్వహణ, మరమ్మతులకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. పాలకొండ నుంచి విశాఖ ప్రధాన మార్గంలో కావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. ప్రతిరోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఒడిశాకు వెళ్లే ప్రధాన మార్గంకావడంతో ఆ రాష్ట్ర ప్రజలు పలు పనులపై విశాఖ వస్తుంటారు. దీనికితోడు సమీపంలో సంకిలి చెక్కర కర్మాగారానికి నిత్యం లారీల్లో చెరకు తరలిస్తుంటారు. ఇరువైపులా ఉన్న రేగిడి, పాలకొండ మండలాల్లోని 50 నుంచి 60 గ్రామాల ప్రజలు రాకపోకల అవసరాలను ఈ వంతెన తీరుస్తోంది. ఈ నేపథ్యంలో వంతెన రోడ్డు బాగా దెబ్బతినడంతో రెండేళ్ల కిందట తాత్కాలిక మరమ్మతులు చేపట్టి అధికారులు చేతులుదులుపుకొన్నారు. అయితే దశాబ్దాల కిందట వంతెన కావడంతో ఆర్‌అండ్‌బీ ఇంజనీర్లు పటిష్ఠతను పరిశీలించాలని పలువురు వాహనచోదకులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు సూచిస్తున్నారు.

రోడ్డు లేక.. వాహనాలు రాక

● పంట ఉత్పత్తులు మార్కెట్‌కు తరలింపునకు అవస్థలు ● ఇది రావివలస గిరిజనుల దుస్థితి

రామభద్రపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావివలస గిరిజనులు రోడ్డు లేకపోవడంతో రవాణా సదుపాయాలకు నోచుకోవడం లేదు. ప్రధానంగా వాహనాలు గ్రామానికి చేరుకోవడానికి అవస్థలు తప్పడంలేదు. దశాబ్దాలకాలం నుంచి రోడ్డు నిర్మించకపోవడంతో గోతులు, రాళ్లుతేలిన మార్గంలోనే గ్రామానికి చేరుకోవల్సి వస్తోంది. రావివలస గిరిజన పంచాయతీలో 13 మధుర గ్రామాలుఉన్నాయి. రోడ్డు లేకపోవడంతో వీరు పండిస్తున్న ఉత్పత్తులు మైదాన ప్రాంతాల్లోని మార్కెట్‌కు తరలింపునకు వ్యయప్రయాశలకు గురవుతున్నారు.2019లో రూ.4.84 కోట్లతో బీటీరోడ్డు పనులు చేపట్టినా అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో రోడ్డుపై కంకర రాళ్లు తేలడంతో నడవలేకపోతున్నామని గిరిజనులు వాపోతున్నారు.సుమారు ఐదేళ్లు కావస్తున్నా ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయడంలో అధికారులపై గిరిజనులు మండిపడుతున్నారు.రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం దూరమవుతోందని వాపోతున్నారు.ఎన్నికల ముందు హామీలిస్తున్న నాయకులు పూర్తయిన తర్వాత తమ గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని ఎనుబరువు గ్రామానికి చెందిన అడారిజయరావు వాపోతున్నా రు.తమ గిరిజన పంచాయతీకిచెందిన బోయినలూర్థమ్మ ఎంపీపీగా, జడ్పీటీసీగా పనిచేసినా బీటీ రోడ్డు సౌకర్యం కల్పించలేదని పలువురు వాపోతున్నారు.కాగా ఇప్పటివరకు రూ.2.20 కోట్లు పనిజరిగిందని, తారు, కల్వర్టు పనులుచేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు నిధులు చెల్లించకపోవడంతో ఈ పనులు నిలిచిపోయాయని సంబంధిత అసిస్టెంట్ ఇంజనీరింగ్ అధికారి రుక్మందరనాయుడు తెలిపారు.



రాళ్లుతేలిన రావివలస రోడ్డు



పైప్‌లైన్ మరమ్మతులకోసం మట్టి తవ్వి విడిచిపెట్టిన దృశ్యం

తవ్వేశారు.. వదిలేశారు

● వాహనచోదకులకు అగచాట్లు ● ఇదీ బొబ్బిలి మునిసిపాలిటీలో పరిస్థితి

బొబ్బిలి/రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మునిసిపాలిటీ పరిధిలోగల నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే హెచ్‌పీ పెట్రోల్ బంక్ జంక్షన్ మలుపు వద్ద పైపులైన్ మరమ్మతులకు గొయ్యి తవ్వేసి విడిచిపెట్టారు. దీనికి 200 మీటర్లలో మరోచోట కూడా మరమ్మతులకు తవ్వి పూడ్చలేదు. ఐదు రోజులు గడుస్తున్నా రోడ్డుపై మట్టి విడిచిపెట్టడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా పార్వతీపురం-రామభద్రపురం హైవే మార్గం కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి తోడు బొబ్బిలి పట్టణంలోకి వెళ్లే ప్రధాన మార్గం కావడంతో ద్విచక్రవాహనాలు, ఆటోల్లో గమ్యస్థానాలు చేరుతుంటారు. పాఠశాలలు, కళాశాలలకు ఈ మార్గంలో వెళ్తుంటారు. అయితే రోడ్డుపై మట్టి విడిచిపెట్టడంతో చీకటి పడిన తర్వాత వచ్చిపోయే వాహనచోదకులు పల్టీలు కొడుతున్నారు. గోతుల్లో పడి గాయపడుతున్నామని కొందరు వాపోతున్నారు. గతంలో వాటర్ ట్యాంక్ వద్ద తవ్విన గొయ్యిని కూడా చాలా రోజుల వరకు పూడ్చకపోవడంతో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురైన విషయం విదితమే.జాతీయరహదారి కావడంతో పార్వతీపురం, రామభద్రపురం వైపు కూరగాయలతో పాటు పలు ఉత్పత్తులు లారీలో తరలిస్తుంటారు. ఈ నేపథ్యంలో మునిసిపల్ అధికారులు స్పందించి జంక్షన్ మలుపు వద్ద తవ్విన గొయ్యిని తక్షణమే పూడ్చివేయాలని పలువురు కోరుతున్నారు.

ఒత్తిడికి గురికాకుండా చదవాలి

● జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి పెంటోజీరావు



మాట్లాడుతున్న పెంటోజీరావు

బొబ్బిలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షలంటే భయం, ఒత్తిడికి గురికాకుండా ఇష్టంతో చదవాలని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి పెంటోజీరావు సూచించారు. ఆదివారం బొబ్బిలి బీసీ వసతిగృహంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు చదువుపై ప్రేరణ కల్పిస్తూ పదోతరగతిలో శతశాతం ఫలితాలే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. బొబ్బిలి సంక్షేమ అధికారి జ్యోతి మార్చిలో జరగనున్న పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఉత్తీర్ణత సాధించేందుకు మెళకువలను వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జి.వాసు దేవరావు, ఉపాధ్యాయులు బి.వాసు, టి.ఈశ్వరరావు, జయలక్ష్మి, డి.శ్రీనివాసరెడ్డి, సరస్వతి, సత్తిబాబు, డి.దాసు, వార్డెన్ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

బొబ్బిలి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పార్వతీపురం మన్యం జిల్లా నాయకుడు పి.ధనంజయనాయుడు పిలుపునిచ్చారు.ఆదివారం బొబ్బిలిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

బడ్జెట్‌లో ఏపీకి మొండిచేయి



ఎం.బూర్జవలసలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

బొబ్బిలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో ఏపీకి కేంద్రం మళ్లీ మొండిచేయి చూపించిందని బొబ్బిలిలో సీపీఎం పట్టణ కన్వీనర్ పి.శంకరరావు ఆరోపించారు. ఆదివారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి రాష్ట్రానికి ద్రోహం చేసిందని ఆరోపించారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి విభజన హామీలు పక్కన పెట్టిందన్నారు. గత బడ్జెట్‌లో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రకాశం జిల్లాలను వెనుకబడిన ప్రాతాలుగా గుర్తించినా ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. ఈ బడ్జెట్‌లో కూడా వాటి ఊసేలేదన్నారు.పోలవరం పునరావాసం, పరిహారం, ప్యాకేజీ గురించి స్పందించలేదని విమర్శించారు.

ఉత్తరాంధ్రపై బీజేపీ వివక్ష

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ఉత్తరాంధ్రకు అన్యాయం జరిగిందని సీపీఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం ఆరోపించారు. ఆదివారం ఎం.బూర్జవలసలో కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ, అభివృద్ధి పనులు ఊసే లేదన్నారు. ఉత్తరాంధ్రపై కేంద్రంలోని బీజేపీ ఎప్పుడు వివక్షత చూపుతునే ఉందని ఆరోపించారు. కార్యక్రమంతో సీపీఎం నాయకులు అప్పల నాయుడు, తదితురులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో బంగారం చోరీ

బాడంగి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రపురంలో చప్ప కృష్ణమూర్తి ఇంట్లో 2.75 తులాల బంగారం, రూ.12వేల నగదు చోరీకి గురైనట్లు ఎస్ఐ టి.తారకేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. చప్ప కృష్ణమూర్తి ఇంటికి తాళం వేసి పక్కనే కిటికి వద్ద ఉన్న సంచిలో పెట్టి ఉదయం పది గంటలకు కుటుంబ సభ్యులు చర్చికి వెళారు. తిరిగి మధ్యాహ్నం మూడు గంటలకు ఇంటికి వచ్చారు. బీరువా తెరిచి చూడగా నగలు, డబ్బులు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్ఐ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. చోరీ జరిగినట్టు నిర్ధారించి కేసు నమోదు చేశారు.

మద్యం వ్యాపారులు నిబంధనలు పాటించాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజాం రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మద్యం వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను విధిగా పాటించాలని రాజాం ఎక్సైజ్ సీఐ జైభీమ్ తెలిపారు. విక్రయాలు, సమయపాలన, ధరలు, బెల్ట్ షాపుల నిర్వహణపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. 'ఆ గంట ఎందుకంట' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు పట్టణంలోని మద్యంషాపుల నిర్వాహకులతో సీఐ ఆదివారం మాట్లాడారు. అనుసరించాల్సిన విధి, విధానాలను వివరించారు. ఎప్పటికప్పుడు షాపులను తనిఖీ చేస్తామని తెలిపారు. తేడాలొస్తే ఎవ్వరిని ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు.



బాగెమ్మపేట చెరువులో పిచ్చిమొక్కలు పెరిగిన దృశ్యం

నిర్వహణ లేక.. నీరు రంగు మారి

● మృత్యువాత పడుతున్న చేపలు ● స్నానాలకు వినియోగించని వైనం

● ఇదీ బాగెమ్మపేట గ్రామ చెరువు దుస్థితి

వంగర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బాగెమ్మపేట శివాలయం వద్ద ఉన్న పంచాయతీ చెరువు నిర్వహణ లేకపోవడంతో నీరు రంగు మారుతోంది. దీంతో తాగు నీటి అవసరాలకు, స్నానాలకు వినియోగించలేని పరిస్థితి నెలకొంది. రెండేళ్లుగా కనీసం చెరువులో అల్లుకున్న తూటి బొడ్లు కూడా తొలగించడంలేదు. దీంతో 2,400 గ్రామస్థులు అవసరాలు తీర్చాల్సిన చెరువు నిరుపయోగంగా మారింది. ఈ చెరువు ఒకప్పుడు పశువులకు దాహార్తి తీర్చడంతోపాటు స్థానికులకు ఎంతగానో ఉపయోగపడేది. చేపల పెంపకంతో పంచాయతీకి ఆదాయం సమకూరేది. ఇటీవల చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మురుగు ఈ చెరువుకు మళ్లించడంతో నీరు రంగుమారితోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆ నీటిలో పశువులు కడిగితే తెల్లారేసరికి దద్దుర్లు వచ్చి రోగాలు బారిన పడుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. చేపలు కూడా చనిపోతున్నాయని చెబుతున్నారు. ఈ చెరుకు అవుట్ లెట్ లేకపోవడంతో కలుషిత నీరు బయటకు వెళ్లడానికి వీల్లేకుండాపోయింది. కాగా చెరువు ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ రెడ్డి కృష్ణ తెలిపారు. మురుగు, కలుషిత నీరు బయటకు వెళ్లేలా ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని కార్యదర్శి ఇందిర తెలిపారు.

పువ్వు రాలిపోయి.. తెగుళ్లు ఆశించి

● పొగమంచు వల్ల ఆందోళన చెందుతున్న మామిడి రైతులు

రామభద్రపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి):రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల్లోని మామిడి రైతులను పొగమంచు ఆందోళనకు గురిచేస్తోంది. ప్రధానంగా పువ్వు మాడిపోయిరాలిపోతోంది. తెగుళ్లు ఆశించే అవకాశముందని చెబుతున్నారు. కొద్దిరోజులుగా రాత్రిపూట విపరీతంగా మంచు కురుస్తుండడం, పగటిపూట ఎక్కువ ఉష్ణోగ్రతల వల్ల మామిడిపంటకు తెగుళ్లు, పురుగులు ఆశించే ప్రమాదముందని రైతులు భయాందోళన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి

రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల్లో సుమారు 11,400 ఎకరాల్లో మామిడిపంటను సాగుచేస్తున్నారు. స్థానికంగా సాగు అధికంగా ఉండడంతో వివిధ మామిడి రకాలను ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. అయితే గత కొన్ని రోజులుగా మంచు కురుస్తుండడంతో పువ్వు, పిందెలు రాలిపోయే ప్రమాదముందని, దీంతో దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు.ఏటా మామిడిపంట సాగుకు రైతులు లక్షలాది రూపాయలు మదుపులు పెడుతున్నారు. చెట్టు మొదటన ఎరువులతోపాటు చెట్ల కొమ్మలకు పురుగు మందులు కూడా స్ప్రేచేస్తున్నా పొగ, తేనె మంచు ఇబ్బందిపెడుతున్నాయని పలువురు రైతులు చెబుతున్నారు.



రామభద్రపురం ప్రధాన రహదారిలో కురుస్తున్న పొగమంచు,(ఇన్‌సెట్‌లో) అరికతోటలో మామిడి పువ్వు రాలిపోతున్న దృశ్యం

వాహనచోదకులకు ఇబ్బందులు

కొద్దిరోజులుగా పొగమంచు కురుస్తుండడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం ఎనిమిది గంటల వరకూ ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కూడా కనబడడంలేదు. రహదారులు పూర్తిగా మంచు కప్పేస్తుండడంతో జాతీయ రహదారిపై వస్తున్న భారీ వాహనాలు నిలిపివేస్తున్నారు. తెల్లవారుజామున మార్కెట్‌కు వెళ్తున్న కూరగాయల వ్యాపారులు, రైతులు ఇబ్బందిపడుతున్నారు.

ట్యాంకు లీకు కావడంతో తాగునీటికి ఇక్కట్లు



పెదశిలగాంలో ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ వాటర్ ట్యాంకు

రామభద్రపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదశిలగాం గ్రామంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వాటర్ ట్యాంకు లీకుకావడంతో గ్రామస్థులు తాగు నీటికి ఇబ్బందిపడుతున్నారు. సుమారు 22 ఇళ్లఉన్న తమ గ్రామానికి శాశ్వత రక్షిత మంచినీటిపథకం మంజూరు చేయాలని పలుసార్లు అధికారులను ఫలితం లేకుండాపోయిందని గిరిజనులు వాపోతున్నారు. అధికారులు హడావిడిగా తాత్కాలికంగా ప్లాస్టిక్ వాటర్ ట్యాంకు ఏర్పాటుచేసినా నిర్వహణపై దృష్టిసారించలేదు. దీంతో ఆరునెలలుగా ట్యాంకు నుంచి నీరు లీకై వృథాగా పోతోందని గ్రామానికి చెందిన కురిడి చిన్నారావు, బోయిన జయరాజులు తెలిపారు. తక్షణమే శాశ్వత ప్రాతిపదికన నీటి సమస్య పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.

మెట్టవలసలో రామాలయం ప్రతిష్ఠ



బొబ్బిలి రూరల్: రామమందిరంలో పూజలు నిర్వహిస్తున్న బేబీనాయన

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మెట్టవలసలో ఆదివారం రామాలయ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీనాయన పూజలు చేశారు.

●బాడంగి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి):బాడంగిలో పోలమ్మ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమానికి బాడంగితోపాటు ముగడ, పిన్నవలస, కోడూరు, పూడివలస, రామచంద్రపురం, డొంకినవలస, గొల్లాది, గజ రాయనివలస, కామన్నవలస, లక్ష్మీపురం, పెదపల్లి గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేలమంది హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, సర్పంచ్ కండి రమేష్, ఎంపీటీసీ శ్రీనివాస్, మరడాన గాంధీ పాల్గొన్నారు.

మేలో దాడితల్లి పండుగ

బొబ్బిలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి మునిసిపాలిటీ పరిధిలోగల గొల్లపల్లి దాడితల్లి గ్రామదేవత పండుగ నిర్వహణ తేదీలను ఆదివారం ఆలయ నిర్వహణ కమిటీ ప్రకటించింది. మే నెల 4, 5, 6 తేదీల్లో పండుగ నిర్వహణకు ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామపెద్దల సమక్షంలో నిర్ణయించారు. ఈసందర్భంగా కమిటీ సభ్యుడు మండలం జనార్దన్ మాట్లాడుతూ మే నాలుగున వారాలు, ఐదో తేదీన ఉయాల కంబాల ఉత్సవం, ఆరో సిరిమానోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి పదోతేదీన అమ్మవారిని గ్రామంలోనికి తీసుకొస్తామని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి మజ్జి రవి, సర్వసిద్ధి హేమంత్, సభ్యులు పాల్గొన్నారు.

రాజచెరువువలసలో సరస్వతీదేవి పూజలు



సరస్వతీ పూజలు నిర్వహిస్తున్న విద్యార్థులు

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజచెరువువలసలో ఆదివారం శ్రీరామమందిరంలో వసంత పంచమి పురస్కరించుకుని సరస్వతీ దేవి పూజలు సమరసతసేవా ఫౌండేషన్‌డివిజన్ ధర్మకర్త ధూపం వాసు ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమంలో బాలవికాస కేంద్రం ఆచార్యులు రాయల పాపారావు, గ్రామ పెద్ద హనుమంతరావు, గౌరయ్య, మండల రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరికతోటలో వాహనాల తనిఖీ



వాహనం తనిఖీ చేస్తున్న ఎస్ఐ

రామభద్రపురం,ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరికతోటలో ఎస్ఐ వెలమల ప్రసాద్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల పత్రాలు తనిఖీ చేయడంతోపాటు వాహనచోదకులు మద్యం తాగి నడపడం, ప్రమాదాల నివారణ, హెల్మెట్ల వినియోగం, లైసెన్స్, బీమా సౌకర్యం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం పై కౌన్సెలింగ్ చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాపై నిఘాపెట్టారు. హెల్మెట్ వాడకం వల్ల కలిగే ఉపయోగాలను వివరించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ధ్రువపత్రాలు లేని వాహనాల నిర్వాహకుల నుంచి అపరాధ రుసుము వసులుచేశారు.

పాఠశాలలను హేతుబద్ధీకరించాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు

బొబ్బిలి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి):జీవో- 117కు సవరణగా జారీచేసిన మెమో ప్రకారంపాఠశాలల హేతుబద్ధీకరణ జరగాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు కోరారు. ఆదివారం బొబ్బిలిలో ఏపీటీఎఫ్ నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా జేసీరాజు మాట్లాడుతూ మెమోలో పేర్కొన్న ప్రకారం ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60కి మించి ఉన్న పాఠశాలలను ఉన్నతీకరించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60 మించి ఉంటే ఆదర్శప్రాథమిక పాఠశాలలుగా మార్పుచేయాలని మెమోలో సూచించారని,దీనికి భిన్నంగా వసతులులేవని కారణం చూపుతూ విలీనం చేస్తున్నారన్నారు.సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు జోగినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల విద్యలో ప్రవేశపెట్టాలని భావిస్తున్న సంస్కరణలు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేవిగా ఉండాలని కోరారు. సమావేశంలో సీహెచ్ ప్రవీణ్‌కుమార్, కుందా శ్రీను, రామకృష్ణ, ఎల్లయ్య, ప్రసాద్, శర్మ, జేబీ దర్శనం, బండి రమేష్, లక్ష్మణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ రాజు

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

